

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

– పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్ధం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**"ఊహుఁ! నాకు నచ్చాడు**. నేనీ పెళ్ళికి ఇష్టపడుతున్నాను" అన్నాను,

నా పెళ్ళిలో చాలామంది నా వెనకాల మెటికలు విరచి విమర్శించటం నేను వినకపోలేదు.

"మా బాగా రోగం కుదిరింది తల్లీ కూతుళ్ళకి! ఎందరమ్మాయిల మనువులో చెడగొట్టారు, గొప్ప అందం అనే గర్వంతో. తగుదునమ్మా అని పిలవని పేరంటంలా వచ్చి పడేవారు. ఆ అల్లుడొచ్చాడు చూడండి! దిష్టి బొమ్మలా! దేవుడనే వాడొకడున్నాడు" అంటూ రకరకాల వ్యాఖ్యలు.

అమ్మ కన్నీళ్లు పెట్టుకుంది. "చెబితే విన్నావు కావు. ఎలా అంటూన్నారో వింటున్నావా?"

నేను నవ్వి వూరుకున్నాను.

అననీ అననీ. ఎవరేమంటే అనుకుంటే నాకేమిటి? నాకు కావాల్సింది నా ధ్యేయం నెరవేరటం. బహుశా నరసింహం హైదరాబాదులో గాక ఏ మద్రాసులోనే వుండేటట్లయితే నేను ఈ పెళ్ళికి అంగీకరించేదాన్ని కానేమో. హైదరాబాదులో నరసింహం వుంటాడు. అతగాడి భార్యగా నేనూ హైదరాబాదులో వుండాలి.

వస్తున్నా ఊర్మిళా కాచుకో!

పెళ్ళయ్యాక నరసింహం నా దాసానుదాసుడయ్యాడు.

"నన్ను పెళ్లాడటానికి అంగీకరిస్తావనుకోలేదు సీతా! నా అదృష్టం... నీ అందానికి నేను తగను. కానీ దేవి కనికరించినట్లు కనికరించావు. నాకు ఇప్పుడెంత గర్వంగా వుందో తెలుసా?' అంటూ పిచ్చిగా వాగేవాడు. నాకు నవ్వొచ్చేది.

హైదరాబాదు చేరాక, మాలతితో బాగా స్నేహం కట్టాను. వదిన తెచ్చిన ఆస్తి మీద తప్ప వదినమీద కించిత్తు గౌరవం లేని మాలతి, పుట్టింట ఏళ్ల తరబడి పడి వుండటంలో గొప్ప సుఖమూ శాంతి పొందగలుగుతున్న మాలతిని అడ్డు పెట్టుకుని రామానుజానికి వల విసిరాను. రామానుజం ప్రవరుడు కాదు. శ్రీరామచంద్రుని తమ్ముడూ కాదు. శ్రీరామచంద్రుడూ కాదు. వట్టి మగవాడు! ఆడది, నాలాటి స్త్రీ కాస్తంత కనుసైగ చేస్తే ఊర్మిళ లాటి పెళ్ళాన్ని పీక నులిమి పారేసేందుకైనా వెనకాడనంతటి 'ఆడపిచ్చి' గలవాడు.

అయితే చాలా చాలా అందగాడు. నా అందానికి తగిన వాడు. మాలతిని అడ్డు పెట్టుకుని చాలా సినిమాలకు వెళ్లాం నేనూ, రామానుజం. షికార్లు చేశాం. ఇక చివరి ఘట్టం వచ్చేసింది రామచంద్రం.

ఊర్మిళకి ఒకటే గర్భస్రావాలు అవుతున్నాయి. అవి అలాగే అవుతాయి. ఆమె గర్భకోశం చెడిపోయింది. ఇక బిడ్డలు పుట్టే అవకాశం లేదు. ఆమెకు ఆపరేషన్ చేయించాక ఆమె కోలుకున్నాక, ఉద్యోగం చేస్తూ వుంటుంది, రిటైరుమెంటు వచ్చేవరకూ.

నేను రామానుజం భార్యగా దర్జాగా ఊర్మిళ డబ్బుతో కొన్న ఈ ఇంటిని రీ మోడల్ చేయించి మరీ వుంటాను.

మాలతికి తెలుసు ఇది. సుభద్రమ్మ అత్త కూడా అంగీకరించింది ఈ ఏర్పాటుకి. మా అమ్మే కాస్త గింజుకొంటోంది. కానీ ఆమెకూ శ్రీనివాసానికి ఇక వేరే దారిలేదు నేను తప్ప!

మాలతి పాత్ర ఎంతవరకో తెలుసా? లీగల్ గా నేనూ రామానుజం భార్యాభర్తలు అయ్యే క్షణం వరకూ. ఆ మరునిమిషంలో మాలతినీ, దాని పిల్లల్నీ మెడబట్టి గెంటేస్తాను.

ఒకనాడు మా స్వంతం కావాలని, అమ్మ ఆరాటపడిన ఊర్మిళ ఆస్తిని, నాకోసం పెళ్ళిచూపులకి వచ్చి ఊర్మిళ గెలుచుకున్న రామానుజాన్ని కూడా నా స్వంతం చేసుకున్నానిప్పుడు."

వింటున్న నేను నిర్ఘాంత పోయాను. నేను చూస్తున్నది సీతనేనా? ఓ స్త్రీనేనా? సీతలాటి స్త్రీలలో అద్భుత సౌందర్యాన్నిచ్చిన భగవంతుడు వాళ్ళ హృదయాన్ని కఠిన శిలతో నిర్మిస్తాడా? ఆ శిల కూడా పుట్టి రాయి గాక, కేవలం ఈర్ష్యతో ద్వేషంతో, పగతో, అసంబద్ధమైన ప్రతీకారంతో భర్త పట్ల వంచనతో ఘనీభవించిన శిలా!

ఊర్మిళ చేసిన తప్పేమిటి?

"ఊర్మిళకు తెలుసా ఇదంతా?" గొంతుక తడారి పోతుండగా అడిగాను.

"ఊహుఁ! బహుశా త్వరలోనే తెలుస్తుంది. తెలుసుకోవాలిగదా ఎప్పుడయినా. దానికి చాకిరీతో, ఉద్యోగంతో, గర్భస్రావాలతో, అనారోగ్యాలతో సరిపోతుందాయే" అంది నవ్వుతూ.

చెబుతున్న రామచంద్రం కర్చీఫ్ తో ముఖానికి పట్టిన చెమట తుడుచుంటూ అన్నాడు.

"ఊర్మిళ మళ్ళీ గర్భిణిగా ఉందిప్పుడు. సీత రాక్షసత్వంతో ప్రధకం ప్రకారం సాగితే, ఊహించని దృశ్యం ఏదేనా చూచినా ఈ గర్భమూ నిలవక పోవచ్చు ఆమెకు. ఇక తనకు పిల్లలు కలగరేమోననే నిస్పృహకు లోనై, తాను ఒంటరిదాన్ని అనే భావంతో సతమతమై పోతున్న ఊర్మిళకు ఈ షాకు ఏ స్థితిని కల్పిస్తుందో నాకు ఆందోళనగా వుంది లలితా. ఓ వేపు మామగారి ఆరోగ్యం బాగా లేదు. మేం విజయవాడ వెళ్లి తీరాల్సిన సమయం ఓ వేపు. మరోవేపు ఊర్మిళ. నాకేం పాలుపోవటం లేదు."

లలిత చాలాసేపు అలాగే కూర్చుండి పోయింది ఆలోచిస్తూ,

శూర్పణఖ, తాటకి, లంకిణి వగైరా రాక్షస స్త్రీలు ఎందఱో వున్నారు అని పురాణాలు చెబుతున్నాయి. వాళ్ళానాడే కాదు. ఈనాడూ వున్నారు. మనుషులలో కలిసిపోయి, అందమైన పేర్లతో, అందమైన ఆకారాలతో... నాగరికపు వేషధారణతో, భాషతో.

తన బావ తనను పెళ్ళాడి, అమెరికాకు వెళ్లి అక్కడ మరొకర్తెను పెళ్ళాడి స్థిరపడి పోయినట్లు తెలిసినప్పుడు తను నిర్ఘాంతపోయింది. తనని ప్రేమించానన్నాడు. ఆ మేరకు ఏవేవో వెర్రిచేష్టలు చేసేవాడు. అమ్మా, నాన్నా గమనించారు. పెళ్లి చేసేస్తే అమ్మాయి కోర్కు పూర్తి చేసుకోవచ్చు లెమ్మనుకుని పెళ్లి చేసారు. మొదటి రాత్రి 'నువ్వే నా సర్వస్వం" అన్నాడు.

“నేను రెండేళ్ళు కోర్సు పూర్తి చేసుకుని వస్తాను అమెరికాలో. ఆ సరికి నువ్వూ డాక్టరు డిగ్రీ పుచ్చుకుంటావు లలితా. ఇద్దరం పెద్ద సిటీలో ప్రాక్టీసు పెడదాం” అన్నాడు.

మూడు నెలలు హనీమూన్, బెంగుళూరు, మద్రాసు, బొంబాయి, కాశ్మీరు.... అలా దేశం నాలుగు మూలాలూ మంచి నీళ్ళల్లా డబ్బు ఖర్చు పెడుతూ.

తేరా ఈ కబుర్లు, ఈ ప్రేమలూ ఏ గాలికి ఎగిరి పోయాయో. ఏకంగా వో అమెరికన్ యువతిని తనలానే డాక్టరు కోర్సు చదువుతున్న దాన్ని పెళ్ళాడేశాడు.

ఆ కబురు తెలిసి అమ్మా, నాన్నగారు కుప్పకూలి పోయారు. పెళ్లి అయి కొద్దికాలమే అయినా కాపురం చేసిన తమ పిల్ల భవిష్యత్తు ఏమిటని తల్లడిల్లిపోయారు.

తను నిర్ఘాంతపోయింది. తన భవిష్యత్తు ఏమిటి? తను అనాఘ్రాత పుష్పం కాదు. వివాహిత. ఓ విధంగా భర్తృ పరిత్యక్త.

ఇలాగే డాక్టరుగా ప్రజాసేవ చేసుకుంటూ జీవితాంతం వుండిపోవటమా? అలా వుండగలదా తను? కోరికల్ని జయిస్తున్నామన్న భ్రమతో అణచి పెట్టుకుంటూ, ఏ చిన్న జంటను చూచినా ఈర్ష్యతో భగ్గుమంటున్న గుండెను... ఏవో వేదాంతపు మాటలతో తాత్కాలికంగా చల్లార్చుతూ, ఆ తాలూకు ఆరని అగ్నిని, చుట్టుపక్కల వారి మీద కురిపిస్తూ, కొందరు నన్స్ లా శాడిస్ట్ మనస్తత్వంతో లేక చాటుమాటు ప్రణయాలతో... ఛ... ఛా...

లేక పెళ్లాడతానంటే బహుశా యువకులు ముందుకు రావొచ్చు. అది తనమీద ప్రేమ కాదు. తను వో లక్షాదికారికి ఏకైక సంతానం. ఆ డబ్బు, ఆస్తి తాలూకు ఆకర్షణతో!

అంతకంటే ఆత్మహత్య మేలు. తన డబ్బుతో ‘తన వివాహిత గతాన్ని’ కప్పి వేస్తాడా యువకుడు.

అలా రాత్రింబవళ్ళు ఆలోచనలు...

ఎప్పుడో నిద్ర లాటి నీరసం, మత్తు...

ఒకానొక చైతన్య రాహిత్య స్థితి.

ఈ రామచంద్రం రోజూ వచ్చేవాడు.

"లలితా! నీకు చదువుంది. ఆరోగ్యం వుంది. మరణించేందుకు చాలా వయసుంది. నిన్ను నువ్విలా చైతన్య రాహిత్య స్థితిలో పడేసుకు సాధించేదేమిటి?" అనేవాడు.

తనలో మొద్దుబారి పోతున్న చైతన్యాన్ని, చల్లని మాటలతో, ధైర్య వచనాలతో తట్టి మేల్కొల్పాలని చూచేవాడు. రామచంద్రానికి తమ ఇంట్లో చాలా గౌరవం వుంది అమ్మా నాన్నలకి.

లాయర్ రాజు మంచి వ్యక్తిత్వం గలవాడు.

అతనితో పరిచయం కలిగించాడు.

"నీ డబ్బు నాకు అవసరం లేదు లలితా! నీకు పెళ్లి అయి వుంటే, మీ బావతో కొంతకాలం సంసార యాత్ర సాగించి వుంటే.. ఉండనీ. మీ బావ తిరిగి వచ్చి నిన్ను మామూలుగా స్వీకరించి వుంటే నువ్వు కాదనేదానివి కాదు.

కానీ అతగాడే చంచలత్వంతో మరో పెళ్లి చేసేసుకున్నాడు. నీ తప్పేం లేదు ఇందులో.

ఓ భార్య చనిపోయాక మగవాడు  పెళ్లాడుతాడు మళ్ళీ. అది తప్పుకానప్పుడు నీలాటి స్త్రీ మళ్ళీ పెళ్లాడటంలో తప్పు లేదు. నేను నిన్ను పెళ్ళాడుతాను" అన్నాడు బాగా పరిచయం పెరిగాక ఓ రోజు. తాను చాలా దూరం ఆలోచించింది. రామచంద్రం ప్రోత్సహించాడు. తన అమ్మా, నాన్నలకీ నచ్చ చెప్పి అంగీకరింప జేశాడు.

ఫలితంగా తనూ రాజూ పెళ్ళాడారు.

రాజు సంస్కారి. ఉన్నత వ్యక్తిత్వం  గలవాడు. అతగాడి నీడలో తనలోని చైతన్యం పురులు విప్పుకొంది. చైతన్య రాహిత్య స్థితిలో నుంచి అతి చైతన్యంలోకి తాను జలపాతంలా దూకింది.

'లలితా నర్సిగ్ హోం' రోరింగ్ ప్రాక్టీస్. పేషెంట్లు, కీర్తి, డబ్బు, ఎందరికో ఉచిత సేవ... ఈనాడు తనొక చైతన్యలహరి. ఆనందలహరి తమ కాపురం!

"ఏమిటాలోచిస్తున్నావు లలితా?"

రామచంద్రం ప్రశ్నతో త్రుళ్ళి పడింది.

"ఊర్మిళ గురించి నాకిప్పుడు ఆందోళన కలుగుతోంది రామచంద్రం. నా శాయశక్తులా చూస్తానామెని. కానీ ఆ దెయ్యం సీతవల్ల షాక్ వస్తుందేమో ఊర్మిళకని నాకూ భయంగానే వుంది సుమా " అంది.

రామచంద్రం మాట్లాడలేదు.

“ఎలాగైనా ఈ సారి అబార్షను కాకుండా వుంటే ఫర్వాలేదు. అయితే గర్భకోశం తీసివేయక తప్పదు. ఏదేనా అత్యవసరం అనిపిస్తే వజయవాడకు నీకు ‘కాల్’ చేస్తాను. వెంటనే బయలుదేరి రా. ఊర్మిళకు ఆత్మీయులం అంటూ ఎవరేనా వుంటే చనిపోయిన మీ మామయ్యా శేషాచారిగారు ఎలాగూ లేదు. మిగిలి ఉన్నది మనం ఇద్దరమే. ఆమె భవిష్యత్తు ఏదైనా ప్రమాదంలో పడితే బాధ్యత తీసుకోవలసిందీ మనిద్దరమే.

అన్నట్లు రేపు సుధీర్ అని మా రాజుకు దూరపు బంధువు, అతగాడూ, అతగాడి భార్య శాంతి, వాళ్ళ పిల్లలు వస్తారు బాంబే నుంచి ప్లేనులో. రిసీవ్ చేసుకుంటాం. వాళ్ళకి డిన్నర్ ఇస్తాం. నువ్వూ, సుమతీ రావాలి తప్పకుండా. ఆ శాంతి గారికి సాహిత్యం పిచ్చి అట. ఎక్కడికి వెళ్ళినా తనకి నచ్చిన రచనలు చేసే రచయితలనూ, రచయిత్రులనూ పర్సనల్ గా కలుసుకోవటం హాబీ అట. ఇక్కడా ఆ కార్యక్రమం ఒకటుందని ముందే సుధీర్ రాజుకు ఉత్తరం వ్రాశాడు. ఒక్కో మనిషికి ఒక్కో హాబీ, లేదా వెర్రి” అంది లలిత నవ్వుతూ వాతావరణం తేలిక చేస్తూ.

సుధీర్, శాంతిలు వచ్చారు.. డిన్నర్ టైంలో రచయిత్రి అహల్య గురించిన ప్రస్తావన రావటం, శాంతి అహల్యను కలుసుకోవాలని చెప్పటం జరిగిపోయాయి, అక్కడేమైందో తెలీదు. కానీ నాలుగోరోజు హఠాత్తుగా శాంతి ఈనిన పులిలా జ్వలిస్తున్న కళ్ళతో అందర్నీ సమావేశ పరచింది.

“డాక్టర్ రామచంద్రంగారూ! వీరు ప్రఖ్యాత రచయిత్రి అహల్య భర్త గోపాలరావుగారు, మనందరం అంటే మీరూ, నేనూ, గోపాలరావుగారు, డాక్టరు లలిత, లాయర్ రాజుగారు, మనందరం రెండు కార్లలో ఈ సిటీలోని వో ప్రఖ్యాత హోటల్ కు (అదే లాడ్జి కూడా లెండి) వెళదాం. ఓ రసవత్తర దృశ్యం చూపిస్తాను మీకందరికీ” అంది తాగినదానిలా, తూలుతున్నట్లు డెస్పరేట్ గా. క్రైం థ్రిల్లర్ లా ఏమిటది?

ఆ రసవత్తర దృశ్యం మేమిటి? దానితో తమందరికీ సంబంధం ఏమిటి? రచయిత్రి భర్త గోపాలరావుగారి నెందుకు కారులో పిల్చుకు వచ్చిందీ శాంతి?

రామచంద్రానికీ, లలితకూ, రాజుకూ, సుమతికీ అంతుపట్టటం లేదు. అర్థం కావటమూ లేదు.

గోపాలరావుక్కూడా ఇందరి అపరిచితుల మధ్య తనని ఎందుకు రమ్మని మరీ మరీ కోరి శాంతి పిల్చుకు వచ్చిందో బోధ పడటం లేదు,

“అదేమిటో చెప్పండి శాంతీ?” అంది లలిత. “సస్పెన్స్ భరించలేం” అని కూడా అంది నవ్వులాటగా.

"ఊహుం! అలా చెబితే థ్రిల్ వుండదు. మరో ఐదు నిముషాలలో మనం బయలుదేరుదాం. నేను డాక్టర్ రామచంద్రం గారు, సుమతి, గోపాలరావుగారు ఓ కారులో, మీరూ, రాజుగారూ మరో కారులో బయలు దేరుదాం. బహుశా వచ్చేటప్పుడు మనతో మరో ఇద్దరు వ్యక్తులు ఉండవచ్చు."

శాంతి కారు దగ్గరకు వెళ్ళింది. ఆమె ప్రవర్తన విలక్షణంగా వుంది.

శాంతి, సుధీర్ వెళ్ళిపోయాక వెర్రిదానిలా విరగబడి నవ్వుతూ ఉండిపోయిన అహల్య కాదు కమల... చాలాసేపటికి తనని తాను కంట్రోల్ చేసుకుంది.

"ఏమిటా నవ్వు పిచ్చిదానిలా కమలా?' అన్నాడు గోపాలరావు కాస్త మందలింపుగా.

"నవ్వా? కాదు గర్వం! ఇది... ఈ శాంతి నన్నెంత అవమానపరిచిందో మీకేం తెల్సు? ఎంత గర్వంగా వుండేది ఆరోజుల్లో. ఈ రోజు నేనే ప్రఖ్యాత రచయిత్రి అహల్యనని తెలిసి ప్రాన్పడి పోయింది.

నా కీర్తి ముందు తన డబ్బు వెల వెల పోయిందని తెలిసి చచ్చినంత పనయింది. మా బాగా తిక్క కుదిరింది తిక్క! అప్పుడే ఏమైంది? ఓ ఆట ఆడిస్తాను దీన్ని" అంది కమల నవ్వుతూ.

"పోనిద్దూ. ఆవిడకున్న గర్వం ఆవిడకుంది. నీకున్న గర్వం నీకుంది" అన్నాడు తేలిగ్గా గోపాలరావు.

కమల ఆలోచిస్తోంది రాత్రంతా.

సుధీర్ ఇక్కడ తాము వారం రోజులు ఉంటామని చెప్పాడు. తనొక్కడూ బిజినెస్ పన్ల మీద ఏ హోటల్ లో వుండేది కోడ్ భాషలా చెప్పాడు. అక్కడ తనని కలుసుకోవచ్చని సూచన. శాంతిని ఏడిపించాలంటే ఇదే చక్కటి అవకాశం.

సుధీర్ కు ఇంకా తనమీద ఆకర్షణ వుందని రుజువు చెయ్యాలి.

సుధీర్ కు డబ్బు పరంగా తప్ప నీ మీద యే ఆకర్షణా లేదు సుమా అని దెబ్బ కొట్టాలి.

'రుబ్బురోలులా వున్న నువ్వు పెళ్ళానివైతే కావొచ్చు. సుధీర్ అందానికి అభిరుచులకి తగిన జోడీని నేనే సుమా' అని శాంతి బ్రతికినంత కాలమూ ఏడ్చిపోయేలా దెబ్బ తీయాలి.

అందుకు పథకం...

సుధీర్ ను వెన్నంటి కనిపెడుతోంది శాంతి.

ఆమెకూ అనుమానంగానే వుంది, కమల తనని దెబ్బ తీస్తుందని. ఆ సాయంత్రం కమలను, ఆ హోటల్ లో ఫలానా టైంలో కలుసు కోమంటూ సుధీర్ గోపాలరావుకు అర్థం కాని విధంగా ఏదో గేయం అన్నట్లు వ్రాసి, "ఇది సరిచూచి పంపండి అహల్యగారూ" అని వ్రాసి పంపిన కాగితం శాంతి చూచి అర్థం చేసుకుని మరీ పంపింది ఏమీ ఎరగని దానిలా నౌకరు కుర్రాడి చేత.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments